

# సినిమా సరదా

## కొడవటిగంటి కుటుంబరావు

నన్ను వెంటనే బయలుదేరిరమ్మని రంగనాథం టెలిగ్రాం ఇచ్చాడు. అదిచూసి మా ఆవిడ చాలా సంతోషించింది. నన్ను వెంటనే బయల్దేరి వెళ్లమని ప్రోత్సహించింది.

"పిచ్చిదానా, నీకు రంగనాథం సంగతి తెలీదు. వాడంతమంచివాడు లేడు, వాడంటే నా కిష్టంకూడా అనుకో; కాని వాణ్ణి నమ్మటంకన్న బుద్ధితక్కువ పనిలేదు. ఆకాశానికి నిచ్చెనవేసి, అది ఆనిందోలేదో చూడకుండా గబగబా మెట్లెక్కేరకం. వాడికి తగిలిన టొప్పెలు మామూలు మనుషులకు తగిలితే వాళ్ళు ఈసరికి సన్యసించటమో, రాజ్యాలేలటమో చేసి ఉందురు. రంగడు అనుభవంద్వారా నేర్చుకునే బాపతుకాదు. ఈ టెలిగ్రాం నమ్మి వెళ్ళితినా సిద్దెన్నమాచారం వెళ్ళినట్టవుతుంది,'' అని ఆవిడ ఉత్సాహం పాడుచెయ్యా ప్రయత్నించాను.

కాని మా ఆవిడ అంత సులభంగా నిరుత్సాహపడలేదు. నిజానికి రంగడి లక్షణాలు కొన్ని మా ఆవిడలోకూడా లేకపోలేదు. మేలెంచిగాని కీడెంచదు. ఒక

మనిషికి కలిగే అనుభవాలలో కొంతవరకైనా ఆ మనిషి ప్రవృత్తి ప్రతిబింబిస్తుందని తెలుసుకోదు. "అదివరకట్లా అయింది. ఈసారి ఇంకోవిధంగా కావచ్చు," అనే ధోరణిలో ఉంటుంది. ఏ క్షణాన ఏది జరిగినా జరగవచ్చుననే వాళ్ళనే భరించటం కష్టం. ఏ క్షణాన మేలు జరిగినా జరగవచ్చుననే దురాశగలవాళ్ళని భరించటం మరీకష్టం. మా ఆవిడ ఈ రకం. రంగడుకూడా అంతే. పైపెచ్చు వీళ్ళిద్దరికీ ఉన్న మరోసామ్యం ఏమిటంటే, వాళ్ళిద్దరికీ నా తెలివితేటల్లోనూ, శక్తిసామర్థ్యాలలోనూ అంతులేని నమ్మకం. నాలో ఈ యిద్దరికీ ఉన్న విశ్వాసం ఏ ధనికుడికో ఉంటే నిరుద్యోగంతో బాధపడకుండా నా భార్యకూ పిల్లలకూ ఇంత తిండయినా పెట్టగలిగి ఉందును. నే నామాట అన్నప్పుడల్లా మా ఆవిడ, "రోజులెప్పుడూ ఒకటిగానే ఉంటాయా ఏమిటి? రేపు మీరే అందరికన్నా ఎక్కువ సంపాదించవచ్చు," అనేది. కదిలిస్తే కంపంతా కదులుతుందని నే నెవరికన్న ఎక్కువ సంపాదించవచ్చునో అడిగేవాణ్ణి కాను.రంగడుకూడా నాతో, "ఏమిట్రా? ఈ సంపాయించేవాళ్ళంతా నీకన్న మొనగాళ్ళా?" అనేవాడు.

కాస్తో కూస్తో బుద్ధిమాంద్యంగలవాళ్ళకు తప్ప నాలో విశ్వాసం కుదరదు కాబోలని నే నొక్కొక్కసారి భయపడుతూఉండేవాణ్ణి. ఇంకో విచిత్రం ఏమిటంటే నాలో ఇంత విశ్వాసంగల ఈ యిద్దరూ నా నిర్ణయాలను కాస్తయినా గౌరవించవాళ్ళుకారు ఏది చెయ్యాలో వాళ్ళు చెప్పేవాళ్ళు, ఎట్లా చెయ్యాలనేది నాకు వొదిలిపెట్టేవాళ్ళు. ఎట్లా చెయ్యాలో తెలిసినవాడికి ఏది చెయ్యాలనేది ఎందుకు తెలియదో వాళ్ళకే తెలియాలి, ఇంత అసాధారణ ప్రజ్ఞావంతుణ్ణయిన నేను ఈ యిద్దరి గార్డియన్‌షిప్పులోనూ ఉంటూ ఉండవలిసివచ్చేది.

నా మద్రాసు ప్రయాణానికి మా ఆవిడ టిక్కెట్టుకొనడం తరవాయిగా అంతా సిద్ధంచేసింది

"అదికాదే! ఆ త్రాష్టుడు కార్డుముక్కతో పొయ్యేదానికి ఉభయఖర్చులతో అర్జంటువైరిచ్చాడుగాని ఆ డబ్బు నాకు పంపితే రైలుచార్జీకైనా ఉండేది కద! ఇప్పుడు పోవటానికి డబ్బేదీ?" అన్నాను.

"నా నాను తాకట్టుపెట్టండి. కాసుల పేరుతోపాటు కలిసి తీసుకోవచ్చు," అన్నది మా ఆవిడ.

"ఇదివరకు నీ సొమ్ము దుర్వినియోగం చేసింది చాలదూ?"

"మీదంతా తల్లకిందులు వాదన. అవసరమైనదానికి ఖర్చుపెట్టేది దుర్వినియోగమంటారు. ఊరికే కూర్చుని తిన్నది సద్వినియోగమంటారు. నా

నగలు తాకట్టుపెట్టటం కొత్తయినట్టు మాట్లాడతారేం ?"

"అదికాదే! ఈ వెధవ సినిమా తీయించటమేమిటి? వాడికీ నాకూ సినిమా తియ్యటం ఏమిటో ఎట్లా తెలుసు? వీణ్ణి నమ్మి ఈ వ్యాపారంలో దిగేవాడు వాడెంతటివాడనుకోవాలి? నేను నేర్చుకోవటానికైనా ఉండదే?"

"చాల్లెస్తురూ? మీ రేవేవో దిక్కుమాలిన కథలన్నీ రాయటంలేదూ? సినిమాకు రాయలేరా ఏం? అన్నీ చూసొచ్చినట్టు రాస్తారే? సినిమాకేం తెగు లొచ్చింది?"

"ఎట్లా అయినా సినిమా అన్న తరవాత కొంచెం కష్టంకాదూ? దానికేవో ఏడుస్తయి," అన్నాడు అయోమయంగా.

"ప్రతి సినిమా చూసివచ్చి విమర్శిస్తారే? అక్కడ బాగాలేదు, ఇక్కడ బాగాలేదు అంటూ? ఇన్ని సినిమాలు వచ్చినా ఒక్కటీ మీకు నచ్చదుగదా, ఇంకేం, వెళ్ళి అన్నిటికన్న మంచి సినిమా తియ్యగూడదూ ?"

"వంటలో తప్పులు పట్టటమూ, వండటమూ ఒకటేనా?"

"చూస్తుంటే అదే తెలుస్తుంది. మీరు నేర్చుకోలేని విద్య ఉందా ఏమిటి?"

ఎంత గొప్ప నాకు!

"అదికాదే! అసలు సినిమాలైను చాలా ఛండాలపుది. అందులోకి రకరకాలవాళ్ళు దిగుతారు. తాగుడూ, వ్యభిచారమూనూ, అంతా మాలకూడు!" అన్నాను.

"మన బంగారం మంచిదైతే...! చెడిపోదలిచినవాళ్ళు సినిమాలోనే పోవాలా?"...

మొత్తంమీద మా ఆవిడ గట్టిపట్టే పట్టింది. దొరికిన అవకాశాలు పోగొట్టుకుంటే ఎట్లా గన్నది. నా బద్ధకం తప్ప ఇంకేమీ లేదన్నది. కాని తీరావెళ్ళితే ఏం జరుగుతుందో నాకు తెలుసు. శతవిధాల ఏమీ ఉండదు. నాలుగురోజులపాటు కుక్కలలే నేనూ రంగడూ కలిసి పట్నమంతా తిరిగి, చివరకు తిండికూడా డబ్బుండక, రైలుచార్జీకి కూడా ఎవరి దగ్గిరో అప్పు చెయ్యవలసివస్తుంది. అట్లా కాక రంగడు నిజంగానే డబ్బుగలవాణ్ణి పట్టినట్టయితే కొంతకాలం వాడి డబ్బు తగలేసి, చివరకు పిక్చరు తీసే అసలు నాథుడు దొరక్క ఎవరిదారిన వారు వెళ్ళవలసి వస్తుంది. ఒకవేళ దారితప్పి పిక్చరు తీయటమే ఉన్నా అది అధమ చిత్రాల్లో ప్రథమ చిత్రంగా తయారై అందులో నేకూడా ఉన్నానని చెప్పుకోవటానికి నామర్దా అవుతుంది. నాకు దరిద్రమంటే భయమే అయినా అంత కన్నా అసహ్యమేమంటే మోసంచేసి తెలివిగలవాడి దగ్గిరా, మోసం లేకుండా అమాయకుడి దగ్గిరా డబ్బు కాజెయ్యటం. నిజంగా రంగడు సినిమాపిక్చరు తీయించటమే జరిగి అందులో నేను

డబ్బు సంపాదించటం కూడా జరిగిందా ఈ రెండు పద్ధతుల్లో ఏదో ఒకటి తప్పదు.

అయినా మా ఆవిడ వొత్తిడి భరించ లేక పదిహేను రూపాయలు చేత బట్టుకుని మద్రాసు బయల్దేరాను.

* * *

నా టెలిగ్రాము అందింది, రంగనాథం నా కోసం సెంట్రల్ ప్లాట్‌ఫారంమీద ఎదురు చూస్తున్నాడు ఎందుకు బయల్దేరానా అని పశ్చాత్తాప పడుతూనే వచ్చానుగాని, నేను రావటంవల్ల వాడికి కలిగిన సంతోషం చూస్తే రావటం మంచిదే అయిందనిపించింది. డబ్బు పెట్టుబడి చేసే బసవయ్య పట్నంలోనే ఉన్నాడనీ, మాడరన్ హోటల్లో బస అనీ, త్వరలోనే లాడ్జి అద్దెకు తీసుకో బోతున్నారనీ రంగడు చెప్పగానే నా సంతోషం మరింత అయింది. వద్దం టున్నా వినకుండా నన్ను టాక్సీలో ఎక్కించి రంగనాథం మాడరన్ హోటలుకు తీసుకుపోయినాడు

దారిలో వాడు నాకింకా కొన్ని కొత్త విషయాలు కూడా చెప్పాడు అందులో ముఖ్యమైన అంశమేమంటే మనవాడికి బసవయ్యతో నేరుగా లావాదేవీలు లేవుట. బసవయ్య ఏక పుత్రుడు శ్రీనివాసులుట చక్రం తిప్పుతున్నది. బసవయ్య వేను కనగలోనో పొగాకులోనో పెద్ద వ్యాపారం– ఎగుమతి వ్యాపారం– చేసి రెండో మూడో లకారాలు చేర్చాట్ట తన ముద్దుల కొడుకు కోరిక తీర్చలేక ఒక టంటే ఒకటి సినిమా ఫిలిము తీసి అందులో అసలు – లాభం ఉన్నా లేక పోయినా – తిరిగివస్తే ఆ వ్యాపారంతో ముద్దుగా సినుల్ను ఏర్పాటుచేసి తన దారిన తాను యథేచ్ఛగా వేరుకనగా, పొగాకూ అమ్ముకుందామని తీర్మానించా డుట బసవయ్య. రంగడు చెప్పి కబుర్లనుబట్టి సీనాయి ఫోర్తుఫారం కబుపు దాటలేకపోయాడనీ, పదహారో యేటనే ముండా ముతకా పెట్టాడనీ, సినిమా ఆలోచన కలక్కపూర్వం వాడికసలు ఏ ఆలోచనా లేదనీ, అదివరకల్లా వాడు చేస్తూ వచ్చిన ఆలోచనలతో పోల్చి చూస్తే ఈ సినిమా తియ్యటమనేది అత్యుత్తమంగానూ అతి నిరపాయం గానూ బసవయ్యకు తోచిందనీ నేను అర్థంచేసుకున్నాను.

"అంతా బాగానే ఉందిగాని సీనాయికి నువ్వెట్లా దొరికావు? నీకన్నా అనుభ వజ్ఞుడు లేకపోయినాడా?" అన్నాను

"వాళ్ళ మొహం అనుభవం! అనుభవంకన్న ముఖ్యంగా కావలిసింది మెదడు. ఇప్పుడు తీసే పిక్చర్లకంటే మనం చాలా మంచి పిక్చర్లు తియ్యొ వచ్చు" అన్నాడు రంగడు.

"మనం ఎవరు?" అన్నాను.

"నువ్వూ నేనూ, కావలిస్తే నీనును కూడా వేసుకో. వాడు కూడా ఉండనే

ఉంటాడాయె. వాడు మనం చెప్పినది కాదనడు. నువ్వొక్కడివి చాలవుటా?"

నాకింటిదగ్గిర ఉన్నట్టే అనిపించింది.

"మీ సినాయి చెప్పినట్టు మనం విశాలిసొస్తేనో?" అన్నాను.

"వెదవను పీకెపిసికి పారెయ్యనూ? అంతా నువే చూసేట్టు వాడితో ముందే చెప్పాను."

"నీ తెలివి తెల్లవారినట్టే ఉంది నాకు మాత్రం ఏం తెలుసూ?"

నే నీ మాట అనేసరికి రంగడు పులిని చూసినట్టయి "నీకు పుణ్యం ఉంటుంది. ఆ మాట మాత్రం సినాయి దగ్గిర అనకు నీ కంతా తెలుసునని వాడితో చెప్పాను. నిష్కారణంగా ఇద్దరి పరువూ పోతుంది," అన్నాడు.

రంగడి నెత్తిన ఒక్కటి పెట్టి నా దారిన నేను టాక్సీ వెనక్కు తిప్పుకు పోదామనిపించింది.

"నేనే ఏం చేస్తానని వాడితో కోసావు?"

"కథా డయిలాగ్సూ రాయలేవూ?"

"అంతమాత్రమే అయితే ఎట్లాగో ఏడుస్తాను. నేను తప్పుచేస్తే డైరెక్టరుగా వుంటాడుగా సరిదిద్దటానికి?"

"నువే డైరెక్టు చేస్తావన్నానే"

"నేనా? నీకేమైనా మతిపోయిందా యేం?"

"చాలేరా, నీ నంగివేషాలూ! వెధవని తెలుగుపిక్చరు డైరెక్టు చెయ్యలేవా? నువు నాటకాలాడించలా? రిహార్సల్సు చేయించలా? అడిగే వెదవ లేడుగాని నేను అమాంతం పది పిక్చర్లు డైరెక్టు చేసి పారేద్దునే!"

"పది వొద్దు. ఈ ఒక్కటీ చెయ్యి నీకు పుణ్యముంటుంది," అన్నాను.

"సరే అంతగా అయితే డైరెక్షను విషయం తరవాత మెల్లిగా సినాతో నే చెబుతాగాని, ముందర్లిగా నీకు చాత కాదని అనెయ్యకు." అన్నాడు రంగడు.

"ఇంకేమేం చేస్తానన్నావు?" అన్నాను.

"ఇంతే. ఇంకేముందీ?" అన్నాడు రంగడు. వాడింకేదో దాస్తున్నాడని నాకు సందేహం కలిగిందిగాని తరిచి అడగ లేదు. ఎందుకంటే వాడి మొహంచూస్తే జాలివేసింది నేను డైరెక్షను చెయ్యలేనురా, బాబూ, అంటే చెయ్యనన్నట్టు అర్థంతీసుకుని, తనను నేను నమ్మించి నడిసముద్రంలో ముంచినట్టు వాడు భావించుకున్నాడు. వాడి మొహంచూస్తే నా కా సంగతి స్పష్టమయింది. వాణ్ణి పుస్తకం చదివినట్టు చదివెయ్యగలను.

మనని అభిమానించేవాళ్ళు లేకపోతే లేరని ఏడుస్తాంగాని, వీళ్ళ మనమీద వేసే భారం చూస్తే ఒక్కొక్కసారి కీర్తికన్న అజ్ఞాతవాసం మేలనిపిస్తుంది.

* * *

హోటల్లో ఒక డబుల్ రూములో బసవయ్యా కొడుకూ ఉంటున్నారు

దాని పక్కగదిలోనే ఒక సీటు మన వాడు, రంగనాథం ఆక్రమించాడు. రెండో సీటు ఖాళీగానే ఉండటంవల్ల దాన్ని నా కిచ్చేశారు టాక్సీలోనుంచి నేనూ రంగడూ దిగుతుండగా బసవయ్యగారు తన గది గుమ్మందగ్గిర నిలబడి మీసాలుతుడుచుకుంటూ నన్ను చూసి తల ఆడించి, "వచ్చారా?" అని గంభీరంగా అడిగి మరో మాట లేకుండా గదిలోకి వెళ్ళిపోయినాడు. ఆయనకు యాభై యేళ్ళుంటై. చేతులకు మురుగులున్నై. వెనక ముచ్చట ముడి

కాఫీ తాగి, గడ్డం గీక్కుని, నేను స్నానంచేసి వచ్చేసరికల్లా సీనుగాడు ఎక్కడినుండో వచ్చి రంగడితో పదిమంది పెట్టుగా మాట్లాడుతున్నాడు.

"మీరు రారేమో ననుకుని భయపడ్డాం. మీకోసమే అంతా ఆపి ఉంచాం. కథ ఏమైనా ఆలోచించారా?" అని ఆత్రపడ్డాడు సీనాయి.

"ఉండరా! ఇప్పుడేగద వాడు వొచ్చింది," అని రంగడు వాణ్ణి కోప్పడ్డాడు.

సీనాయి ఆత్రం వర్ణనాతీతం. వాడి కున్నంత సినిమా వెర్రి ఎవరికీ ఉంటుం దనుకోను. సాధ్యంకాదుగాని ఆ సాయంత్రానికే వాడికి సినిమా తీసిపారెయ్యాలని ఉంది. ఆ మాట నోటంట అన్నాడుకూడానూ.

"నాటకం ఆడినంతసేపేగదా సినిమాకూడా ఆడేది? ఒక్కరోజులో నాటకమల్లే ఎందుకు తియ్యకూడదో?"

తాను తియ్యబోయే చిత్రం గురించి మాట్లాడటానికేమీ లేకపోతే ఇతర సినిమా కంపెనీలను గురించీ, చిత్రాలను గురించీ మాట్లాడేవాడు. చెవికోసిన పిట్టలే ఒకటే వాగుడు. మేం భోజనం చేసేలోపుగా తను పుట్టింది లగాయతు చూసిన మూవీలూ, టాకీలూకూడా వర్ణించాడు. ఆ తరవాత ప్రస్తుతం తీస్తున్న చిత్రాలన్నిటిలోనూ ఎవరెవరు నటిస్తున్నారో, ఎవరెవరు కామెరాలు తిప్పుతున్నారో, సౌండు రికార్డుచేస్తున్నారో, ఏయే స్టూడియోల కెవరెవరు పెత్తందార్లో అన్నీ చెప్పాడు. వాడు ఇంత సంభాషణమధ్యా అయిదు నిమిషాల కొకసారి గగ్గయ్యను గురించీ రామతిలకాన్ని గురించీ చెప్పటం చూసి వాళ్ళిద్దరూ వాడికి అభిమానతారలేమో అనుకున్నా నే ననుకున్నది నిజమేగాని దానికి కారణం నేనూహించినది కాదు. కలకత్తాలో సావిత్రి చిత్రం తీసేటప్పుడు సీనుగాడి స్నేహితు డక్కడే ఉండి ఒక రోజు షూటింగు చూశాడుట

సీనుగాడి సంభాషణ రెండున్నర నిమిషాలకన్నా భరించటానికి టానిక్కుల సహాయం అవసరం. భోజనం చెయ్యగానే నిద్రపోవటం అలవాటని వంక పెట్టి తప్పించుకున్నాను.

మధ్యాహ్నం మూడుగంటలకల్లా



సినిమాకు వెళ్ళే ప్రోగ్రాం. దగ్గరలో వెస్టెండులో ఇంగ్లీషు సినిమా ఉంది. దానికి వెళ్లాం. ఇంటర్వెల్లో సీనాయి ఇంగ్లీషు సినిమాల్లో లోపాలమీద ఉపన్యాసం ప్రారంభించాడు అందరూ మాకేసే చూస్తున్నారు. నాకు సిగ్గేసింది. చర్చ సీనాయికీ, రంగడికీ వొదిలేసి నేను వాళ్ళవెంట రానట్టు మొహంపెట్టి ఓ ప్తులు చూడసాగాను.

సినిమా అయిపోయే టైముకు సీనాయి నన్ను "ఏమోయ్," అని పిలుస్తున్నాడు.

"ఇప్పుడేంచేస్తాం? పోయి ఎక్కడన్నా తాగుదామా? జల్సాకు ముందు బ్రాందీ లేకపోవటం ఏమిటోయ్?" అన్నాడు సీనాయి.

"నాకు లైమ్ జూస్ తప్ప సయించదు," అని చెప్పాను.

"నాన్సెన్స్! మా వెంట రాకపోతే నేనొప్పను. పెద్ద వాట్టే," అన్నాడు సీనాయి.

"మనవాడికూడా అలవాటుందిలే,

అప్పుడప్పుడూ !" అని రంగడు సీనాయికి ప్రోత్సాహం ఇచ్చాడు.

సీనాయితో సావాసమంటే నా కెంత వెగటుగా ఉందో రంగడు అర్థంచేసుకో లేదు. రంగడు మంచివాడు, సర్వ సముడు. నేనంత నిష్కల్మష హృదయుణ్ణికాను, కపటిని. ఎంతో విచారించిగాని నేను స్నేహం చెయ్యను. నా కిష్టంలేని మనిషిని అంతదూరాన ఉంచటానికి నా అంతరాత్మ అంగీక రిస్తుంది. సీనాయితో స్నేహంచెయ్యటం నా కిష్టంలేకపోగా, వాడు నా స్నేహం సంపాయించే పద్ధతులుకూడా నాకు రుచించలేదు.

"నేను రానులే. మీ రిద్దరూ వెళ్లండి. నాకు కొద్దిగా పనికూడా ఉంది," అని, వాళ్ళ జవాబుకోసం చూడకుండా సాగి వెళ్ళాను.

ఆ రాత్రి నే నింటికి వెళ్ళేసరికి రంగడు ఒక్కడే ఉన్నాడు. సీనాయి ఏమైనాడని అడిగితే, "ఆఁ, వెధవ!" అని సమాధానం చెప్పాడు అంటే అర్థ మేమిటంటే ఏ కొంపలోనో దూరాడని బయటపెట్టాడు.

"వీడి ఈ వేషాలు సమర్థించా వీడి స్నేహం సంపాదించావ్? నువుకూడా ఏదో కొంపకో దూరలేకపోయినావా ?" అన్నాను.

"ఛీ! ఛీ! నేను వాణ్ణి నిరుత్సాహ పరచబట్టి ఇప్పుడు నయంకాని, నేను లేకపోతే మరీ అన్యాయంరా!" అన్నాడు.

"నాకా తేడా కనిపించలేదు," అన్నాను, సీనాయిని అంతకు పూర్వం ఎరక్కపోయినా.

పాపం, రంగడికి నా మాటలు వేద వాక్యం. ఇవాళవరకూ వాడు సీనాయిని అసహ్యించుకుని ఉండడు. నేను అడుగు పెట్టగానే వాడు సీనాయిని గురించి నా కోసం తన అభిప్రాయం మార్చుకోవటం ప్రారంభించాడు.

* * *

తరవాత సినిమా తీయకపోయినా ప్రస్తుతం వీళ్ళు పెడుతున్న ఖర్చు చూస్తే నాకు మండిపోయింది. మా నలుగురికీ రోజుకు పదిరూపాయల చొప్పున హోటలువాడు కాజేస్తున్నాడు. నెలకు ముప్ఫైరూపాయలు పారేస్తే మంచి ఇల్లు దొరుకుతుంది పూటకు నాలుగణాలకు ఎక్కడైనా భోజనం దొరుకుతుంది. టిక్కెట్టు పుస్తకాలు కొంటే ఇంకా చవుక. ప్రస్తుతం మాకు అర్జంటు పనులేవీలేవు. అయినా ఇల్లు కదిలితే టాక్సీ. బస్సుమీదో, ట్రాము మీదో పోగలిగిన చోట్లకుకూడా టాక్సీలే. సినిమాకు పోతే రూపాయిబేడ టిక్కెట్టుకు తక్కువ కొనటంలేదు. ఇదికాక రోజూ తాగుడు, రోజూ ముండలు. వీటికని సీనుగాడు ఎంత ఖర్చుపెడుతున్నాడో నాకు అంచనాలేదు. గడిచిన రెండు

సంవత్సరాలలోనూ ఏ నెలా నేను పాతిక రూపాయలు మించి ఖర్చుపెట్టి ఉండలేదు. రోజుకు పది పదిహేనూ తక్కువ కాకుండా దుర్వ్యయం అవుతుంటే చూస్తూ ఊరుకోవటం నాకు చాత కాలేదు. ఒకరోజు సీనాయి నన్నూ రంగణ్ణీ వెంటపెట్టుకుపోయి ఒక సిల్కు తాను బేరంచేశాడు, కొన్నాడు. మా ముగ్గురికీ మూడు రెఖ్ఖ ఆరు చొక్కాలు కుట్టించటానికి టెయిలరుదగ్గిరికి ప్రయాణం కట్టాడు. ఆ అవకాశం తీసుకుని సీనాయికి మంచి లెక్చరిచ్చాను.

"నేను చాలామంది వ్యాపారస్తుల్ని చూశాను. వాళ్ళలో బాగా బతికేవాళ్ళనీ చూశాను కాని వాళ్ళెవరూ ఇట్లా పెట్టుబడి డబ్బు మంచినీళ్ళగా వాడరు. ఏమైనా సరదాలుంటే లాభాలతో తీర్చు కుంటారు. నువు ఖర్చుచేస్తున్నది ఎవరి డబ్బోకాదు నీదే!" అన్నాను.

"డబ్బంటే చేదయినట్టు మాట్లాడు తున్నావే?" అన్నాడు సీనాయి, నా దొంగెత్తు బయట పెట్టినవాడల్లే.

"నాకు డబ్బు చేదుకాదు. నాకోసం నువు ఖర్చుపెట్టేదంతా రొక్కంగా యిచ్చుకుంటే దాంతో నా ఖర్చులు గడుపుకోగా నా భార్యాబిడ్డలను కూడా హాయిగా మేపగలను. ఖర్చయే డబ్బుకు క్రమమైన ప్రతిఫలం రావటంలేదని విచారిస్తున్నాను," అన్నాను.

"మనకు రేపు సినిమామీద లక్ష రూపాయలు లాభంవస్తాయి. ఏం ఖర్చు చేస్తే? మనం చెయ్యబొయ్యేది అంత అడవా వ్యాపారమా? దర్జాగా, పెద్దెత్తుగా ఉండాలి రూపాయలు పారేసే వాడికే రూపాయలు అణాపైస లెంచే వాడికి అణాపైసలే,' అన్నాడు సీను ప్రపంచాన్ని కాచి వడబోసినవాడల్లే.

"ఏదో తోచింది చెప్పాను. ఇందు వల్ల నాకు ఒరిగేదేమున్నది?" అన్నాను. నే నెంత చెప్పినా వినక వర్జీవాడిచేత నా కొలతలుకూడా తీయించాడు.

తరవాత నాతో రంగనాథం రహ స్యంగా, "ఎందుకురా వాడికి నవు సలహా చెప్పటం? వాడికి అటువంటి సంహా రుచిస్తుందనా? వాడి డబ్బు వాణ్ణి తగలేసుకోనీ. నీదేంపోయింది? నాదేం పోయింది?" అన్నాడు.

"తీరా పిక్చరు తియ్యటానికి డబ్బు లేకపోతే?" అన్నాను.

"ఆ సంగతి వాడికి తెలీదా?"

"వాడికి మంచీ చెడూ తెలీదనేగా నువిప్పుడు నాతో అన్నది?"

"పోదూ, నీ కెవడు చెప్పగలడూ? నీతో ఎప్పుడూ ఇంతే. అందరికీ బుద్ధి చెప్పాలంటావు. నీకేం పోరుగుతుంది? అందుకే నిన్ను చూస్తే ఎవరికీ ఇష్టం ఉండదు. నువుచెప్పి ఎవణ్ణన్నా ఎప్పుడన్నా బాగుచేశావా?"

ఆలోచించాను. ఆ చివరముక్కలో అబద్ధం కనిపించలేదు. కాని మనుషులు

మారరనుకోవటం నా అంతరాత్మకి రుచించలేదు. నా ఆదర్శమూ, విశ్వాసాలూ అన్నీ మనుషులు మారగలరనే విశ్వాసంమీదే ఆధారపడి ఉన్నట్టుగా తోచింది.

"ఇతరులను బాగుచెయ్యలేకపోవటం నా అసమర్థత అయి ఉండాలి అంతే గాని బాగుచెయ్యటం అసాధ్యమైకాదు. నన్ను ఆ విద్య నేర్చుకోనీ, ఇంకోడు తప్పు చేస్తున్నట్టు నిష్కల్మషమైన నీ అంతరాత్మకు తోస్తున్నప్పుడు ఊరుకుంటే నువ్వేం మనిషివి? నా తప్పులు ఎవరో దిద్దకపోయినట్టయితే నేనే స్థితిలో ఉండేవాణ్ణి?" అన్నాను.


"నీ సంగతి వేరు నువు నేర్చుకోగలవేమో సీనాయి నేర్చుకోలేడు వాడు నిన్ను గురించి ఏమన్నాడో తెలుసా? 'ఇటువంటివాడు సినిమాలేం తీస్తాడు? పదిరూపాయల నోటు చూసి దడుచుకునే వాడు!' అన్నాడు. నేను చివాట్లు పెట్టాననుకో, అయినా నువు డబ్బువిషయం నిర్లక్ష్యంగా ఉన్నట్టు కనిపిస్తే వాడికి కాస్త ధైర్యంగా ఉంటుంది....తరవాత డైరెక్షను విషయం కూడా వాడితో మాట్లాడా. నువు డైరెక్టు చెయ్యనన్నావని చెప్పేటప్పటికి వాడు కంగారుపడ్డాడు. ఏంచేసేది? ఒక కోతకోశా. నువు సంభాషణలూ, పాటలూ రాస్తే మరొకను డైరెక్టు చెయ్యటం బాగుంటుందనీ, ఒకమనిషే అన్నీ చెయ్యటం కుదరదనీ చెప్పా. పేరున్న డైరెక్టరును తెస్తే ఏ రెండు మూడు వేలో ఇవ్వాలిసుండదా అన్నాడు. అందే ఆ ఖర్చు మేం వేసుకోలేదు, అందుచేత నే నన్నానుగదా, "ఎవడో అసిస్టెంటు డైరెక్టరును చవుకలో తెచ్చి, వాడిమీద నిన్ను పెడితే, వాణ్ణి డైరెక్టరు చేసినట్టుంటుంది నువు వెనక ఉన్నావన్న ధైర్యమూ ఉంటుంది," అన్నాడు రంగడు.

"ఎవరీ అసిస్టెంటు డైరెక్టరు? దొరికెకాడా? తకాలా?"

"దొరికాడులే, వెయ్యిరూపాయలకు మాట్లాడాం. ఇవాళ రెండువందలు అడ్వాన్సిచ్చి బుక్ చేస్తున్నాం."

"మీ సాహసం చూస్తే అజ్ఞానం వెనకలేంది ఇంత సాహసం ఎవరికైనా ఉంటుందా అనిపిస్తున్నది. మనెవరికీ సినిమాతీయటం తెలియదు డబ్బిచ్చయిన అనుభవం ఉన్నవాణ్ణి పెట్టుకోవద్దుట్రా? డైరెక్టరుగా పెట్టుకునేవాడికేమైనా తెలుసునో తెలీదో నిర్ణయించేది నువ్వూ, సీనాయీనూనా? పోనీ మీరయినా వాణ్ణి పరీక్షించారా? లేదు. డైరెక్టరంటూ ఒకడికి పెత్తనం ఇచ్చి వాడిమీద నన్ను అధికారిగా పెడతారా? నేను డైరెక్షనుకు పనికిరానో అంటుంటే డైరెక్టరుమీద అధికారం చలాయించటానికి పనికివస్తాననా?"

రంగడు, పాపం, నన్నిక భరించలేకపోయినాడు




"మేము ఏది చేసినా నీకు నచ్చదు. నువు చెయ్యవు. ఎట్లారా నీతో ?"

వాడి అజ్ఞానాన్ని బలపరచని కారణంచేత నేను రంగడి కెంత ప్రతిబంధకంగా తయారయినానో నేనూహించుకోగలిగాను. వాణ్ణి చూస్తే జాలి వేసిందిగాని ఆమోదించటం నా తరం కాలేదు.

"మీ ఇష్టంవచ్చినట్టు ఏడుచుకోండి. మధ్య నాదేంపోయింది ?" అని తాత్కాలికంగా అస్త్రసన్యాసం చేశాను.

* * *

ఆవాడు డైరెక్టరు మా గదికివచ్చాడు. మాట్లాడుతుంటే నాకు అతను వొట్టి పోచికోలు రామన్నగా కనిపించాడు. కొన్ని విషయాల్లో సీనుగాడికి దీటయిన వాడే వాడు అయిదునిమిషాల్లో అరడజను పిక్చర్లుతీసి ఆరులక్షలు లాభం చూపించాడు. "మీ రెవరు ? సినిమాలు తీయటంలో ఏమి అనుభవం ఉంది ?" అని అతను అడిగిన పాపానపోలేదు.

"ఏమండీ, మూర్తిగారూ ? మనం ఏ సబ్జక్టు తీసుకుంటే బాగుంటుందంటారు?" అన్నాడు సీనాయి, డైరెక్టరు మాటలను నిర్దాక్షిణ్యంగా తోసేస్తూ. ఎవరన్నా తనతో మాట్లాడుతున్నప్పుడు సీనాయి వింటున్నాడనుకోవటానికి లేదు

ఇప్పుడు సీనాయికి చాలా సంతోషంగాఉంది ఇంతకాలానికి తనకు సినిమా చిత్ర నిర్మాణం గురించి తనతో మాట్లాడే అర్హతగలవాడు దొరికాడన్న సంతోషం వాడి మొహాన కనిపించింది. ఇక నాతో ఏదన్నా చెప్పుకోవటానికి గాని, నన్ను అడగటానికి గాని సీనాయికి అవసరంలేదు అంతా ఒక గంటలోపుగా సీనాయి మూర్తిని "ఏమండీ" అనటం మానేసి "ఏమిటయ్యా" అనీ, అది కూడా మానేసి "ఏమిటోయ్" అనీ

అన్నాడు పొద్దాకే లోపల ఏమిరా అంటే ఏమిరా అనుకునే స్నేహం మూర్తికి సీనాయికి ఏర్పడి తీరుతుందని నాలో నేను దృఢం చేసుకున్నాను. మూర్తితో తను స్నేహం చెయ్యటంవల్ల నేను ఆసూయపడి చచ్చిపోతానని సీనాయి అనుకుని ఉన్నా నా కాశ్చర్యం లేదు.

మూర్తికి రెండువందలూ అడ్వా న్సిచ్చాను. రెండు పచ్చనోట్లూ భక్తితో మడిచి జేబులో పెట్టుకోగానే మూర్తి పక్కా వ్యాపారస్థుడయిపోయి, "మనం సోషల్ పిక్చరే తీయటం మంచిది. నా దగ్గర ఒకటి రెండు కథలున్నాయి. నచ్చితే వాటిని తీసుకోవచ్చు. లేకపోతే కొత్తది రాసుకోవచ్చు. కథ అనుకోగానే మనం నటులను బుక్కు చేసుకోవచ్చు. సినారియో నేనే రాస్తాను. సంభాషనలూ అవీ రాయించుకుని రిహార్సల్సు ప్రారంభించవచ్చు," అని ప్రణాళిక ఏర్పాటుచేశాడు.

ఆ రోజు లగాయతు రోజూ మూర్తి రాసాగాడు. అతనూ సీనాయీ కలిసి ఎక్కడెక్కడో తిరిగేవారు ఏమేమిటో చేసేవారు. అప్పుడప్పుడూ రంగడు కూడా వాళ్ళవెంట వెళ్ళేవాడు. పుచ్చుకున్న రెండువందలూ కాక మూర్తి సీనాయితో, "అరే బ్రదర్, ఒక ఫైవర్ ఇట్లా పారెయ్యి!" అని అయిదురూపా యలనోట్లు పుచ్చుకుంటూ ఉండేవాడు.

"అబ్బే, నాతో మీ కేమీ పనిలేదు. నేను తిరిగి వెళ్ళిపోతాను," అని చెప్పాను మా రంగడితో.

"ఛీ! ఛీ! అదేమిట్రా? ఉన్న పనంతా నీతోనే ఉంటేనూ!" అన్నాడు రంగడు.

"నా పనేమిటో, ఎంత కస్తారో తేల్చి ఏదో కంట్రాక్టు తగలేయించు. మూర్తి నా తరవాత వచ్చాడు ఏదోలెక్కన అతనికి ముట్టుతున్నది. నేనిక్కడ కూర్చుని హోటల్లో తింటుంటే ఇంటి దగ్గర వాళ్ళేంకావాలి?" అన్నాను.

"ఆ మాట చెప్పరాదూ? ఇవాళే మనియార్డరు చేయిస్తాను ఎంత? ఓ పాతిక పంపనా?" అన్నాడు రంగడు.

"ప్రస్తుతం పాతికపంపు తరవాత చూద్దాం," అన్నాను.

పది, పదిహేనురోజులు గడిచినై, ఇన్నాళ్ళూ అతుక్కుపోయిన సీనూ మూర్తీ ఊడివచ్చినట్టు నా కేదో సందేహం కలిగింది. సీను మళ్ళీ అకస్మాత్తుగా నా ప్రాణమిత్రుడు కావటానికి ప్రయత్నించాడు. స్టూడియో బుక్ చేశా మనీ, రెండుమూడు కథలు ఆలోచించా మనీ చెప్పి అందులో ఏది బాగుందో చూసి, ఏదీ బాగాలేకపోతే నన్ను సొంతాన రాయమని అడిగాడు సీనాయి.

వాడు చెప్పిన కథలన్నీ వింటే నా కేదీ బాగా లేదు. అన్నిటిలోనూ రాజులూ

రాణులూ ఉన్నారు ఒకదానిలో పిస్తోళ్ళు న్నాయి. మరొకదాన్లో కత్తియుద్ధం ఉంది

"ఇవన్నీ పదేళ్ళ క్రితం తీసిన సైలెంటుచిత్రాల కథలే," అన్నాను.

"అయితే నువొక మాంచి కథ రాయి," అన్నాడు సీనాయి.

"కథ ఏదో ఒకటి చూడవచ్చు. కాని నాకా సినారియో ఏమిటో తెలీదే?" అన్నాను,

"అది మూర్తిగాడు చూసుకుంటా డులే," అన్నాడు సీనాయి.

నిజానికి నేను కథగురించి ఆలో చిస్తూనే ఉన్నాను. సినిమా కథకు కేంద్రంలో ఒక సార్వజనీనమైన అంశం వుండాలని ఎక్కడో చదివాను. అదదాని మానసంరక్షణమో, మాతృత్వమో ఏదో ఒకటి ఏడవాలి. అందుకని ఆ రెండు అంశాలూ కలిసివచ్చేటట్టు ఒక కథ ఆలోచించిపెట్టాను.

నేను చెప్పిన కథ విని సీనాయి సంతోషంతో గంతులేసి, "ఇది చాలా ఫస్టుగా ఉంటుంబయ్యాయ్!" అని మళ్ళీ వచ్చి రంగడితో, "ఏమిటో అనుకున్నాను. ఆ మూర్తిగాడు కథ విషయంలో వొట్టి బోకురా!" అన్నాడు.

"అతను డైరెక్టు చేస్తానని వచ్చాడు. కథ రాస్తానని రాలేదు," అన్నాలు.

మళ్ళీ మొదలుపెట్టావా నీ వెదవ ధోరణి. అన్నట్టు సీనాయి నా వంక ఒకచూపు చూసి ఆ పరిస్థితుల్లో నన్ను క్షమించటానికే నిశ్చయించుకున్నట్టు కనపడ్డాడు. ఇన్నాళ్ళూ నన్ను తాను శిక్షించినట్టూ నాలో కొంత పరివర్తన కలిగినట్టూ వాడూహించి ఉండాలి పాపం.

"అయితే ఈ కథలో కొన్ని మార్పులుచేస్తే బాగుంటుంది," అన్నాడు సీనాయి.

"ఏమిటివి?" అన్నాను.

"కథానాయికను తండ్రి అప్పుల బాధవల్ల ఆ ధనికుడికిచ్చి చేసే బదులు, ఆ అమ్మాయికి సవితితల్లిని పెట్టి బాధలు పెడితే ఇంకా బాగుండదూ? ఇంకా అంతకన్న మంచే ఆలోచన చెప్పనా? ఆ అమ్మాయిని ఆడ టార్జానులాగా చూపిద్దాం. అడివిలో ఆమె ధనికుడికి దొరుకుతుంది. తెచ్చి పెళ్ళిచేసుకుంటాడు. వాడు తనకు వద్దని చెప్పటానికి మాటలు రావుగా? గర్భాదానంనాడు రాత్రి కొందరు అడివి మనుష్యులు వచ్చి ఆ పిల్లను ఎత్తుకుపోతారు..."

"ఎందుకూ?"

"ఎందుకేమిటి? అడివిమనిషి ఒకడు ఆ పిల్లను మోహించినట్టు పెట్టవచ్చు."

ఈ ధోరణిలో సీనాయి నా కథను తిరగరాస్తూ వెళ్ళాడు ఆఖరుకు వాడు తేల్చిన కథకూ నే ననుకున్నదానికి సంబంధం లేకుండా పోయింది

"ఈ విధంగా రాయమన్నావా?" అన్నాను.

"ఏమో, నా బొంద నాకేం తెలుస్తుంది? నే నేదో వాగాను. బాగుంటే రాయి," అన్నాడు.

కూచుని రాశాలు.

ఒక అర్ధరాత్రి సీనాయి నా కథను చదివి దిమ్మెడి అంత మొహంచేసుకుని, "చూశావా? నే చెప్పింది ఒక్కటైనా పెట్టలేను," అన్నాడు.

"అదికాదు నువు ఏ అధికారంతో చెబుతున్నదీ నా కర్థంకావటంలేదు. ప్రొడ్యూసరు హోదాలో ఏ మార్పు చెయ్యమన్నా చేస్తాను. అంతా నువే చెప్పి, ఆఖరుకు నిర్ణయం నన్నే చెయ్యమంటే నా నిర్ణయం చేశాను!'' అన్నాను.

"ఆ కాడికి నేను నోరునొప్పెట్టేట్టు చెప్పింది దేనికి?"

"ఏమో! నీకు కథరాయటం గురించి ఏగుడ్డూ తెలీదు. కథ చెప్పటం నీకు సరదా. నీ బుద్ధికి తోచిందల్లా సరదాగా చెబుతావు. నాకు కథరాయటం పని. కథ రాసేటప్పుడు నాకు గొన్ని బాధ్యతలు ఏర్పడినవి. వాటిని సరిగా నిర్వర్తించటం పెద్దపని. అట్లాకాక నీ పూచీమీద నన్ను ఏమి రాయమన్నా రాస్తాను," అన్నాను

"ఎక్కడ తద్దినం వచ్చిందిరా, బాబూ!" అని వాపోయినాడు సీనాయి

"ఆ మాట వెంటనే ఉపసంహరించుకోకపోతే నేనీక్షణం మా వూరు వెళ్ళిపోతున్నాను," అన్నాను.

సీనాయి తక్షణం క్షమాపణ ఇచ్చి, క్షమాపణ ఇచ్చిన బింకంకూడా లేకుండా నవ్వుతూ, "నువుతప్ప ఇంకెవరూ తెలిసినవాడు లేడని నీ నమ్మకంకాదూ?" అన్నాడు

"కనీసం నా కన్న తెలివిగలవాణ్ణి నేను వెంటనే గుర్తించగలను. కొందరి కదికూడా చాతకాదు," అన్నాను.


అప్పటికావిషయం అంతటితో సరిపోయింది

మర్నాడు నేనూ, రంగనాథమూ, సీనాయీ కలిసి ఏదో సినిమాకు వెళ్ళాం సినిమా ప్రారంభం అయి ఒక అయిదు నిమిషాలన్నా కాకముందే సీనాయి, "మనం ఈ కథ తీస్తే?" అన్నాడు. చూద్దామన్నాను

ఇంటికి వచ్చినాక, "ఇది ఖరారు. మనం ఇవాళ చూసిన పిక్చరు తీసేద్దాం," అన్నాడు సీనాయి. ముందూ వెనకా చూడకుండా నన్ను రాసుకు పొమ్మన్నాడు. రాశాను.

మర్నాడు సీనాయి మరో సినిమా చూసివచ్చాడు అది రాయమన్నాడు. ఇన్ని కథలు రాయటానికి నాకు ఓపిక లేదన్నాను. సీనాయి మొహం చిట్లించి, "మన మొదటికథ బాగాలేదు. ఇంకొకటి ఏదైనా రాయి," అన్నాడు.

"రేపు మనందరమూ కూర్చుని చర్చించుకుందాం. ఇటువంటి కథ అనుకుందాం. ఆ తరవాత నేను రాస్తాను.




నీ చపలచిత్తంతో నువ్వెన్నటికీ ఒక నిర్ధారణకు రాలేవు," అన్నాను.

* * *

సినిమా తీయటానికి సన్నాహాలు అతి చురుకుగా సాగినై. సీనాయీ డైరెక్టరూ కలిసి కథ నిర్ణయించుకున్నారు. దానికి ముక్కూ మొహమూ ఉన్నట్టు నాకు కనిపించలేదు. అదివరకు వచ్చిన ఫిలిములలో ఉన్న సన్నివేశాలు కానివి ఒక్కటీ ఇందులోలేదు.

ఆ తరవాత ఆడవాళ్ళ బుకింగు ప్రారంభమయింది. సీనాయి తనకు సంబంధంఉన్న ఒక ఆడదాన్ని తెచ్చాడు. డైరెక్టరు మూర్తి తనకు సంబంధం ఉన్న మరొకతెనూ, దానితో సంబంధం ఉన్న మరొకత్తెని తెచ్చాడు. ఈ వచ్చినవాళ్ళెవరికీ డొక్కశుద్ధిలేదు క్రమంగా సీనాయి చుట్టూ ఒకరకం మనుష్యులు చేరసాగారు. వీళ్ళంతా చేరి తీయబోయే పిక్చరు గురించి మాట్లాడు తుంటే నాకు భయంవేసేది. ఇంత ఆత్మజ్ఞాన విమూఢులుకూడా ఉంటారా? వీళ్ళు సినిమా తీస్తామని రావటమూ, వాళ్ళు రావటానికి ఏ అంతరాయాలూ లేకపోవటమూ చూస్తే నా కాశ్చర్యంగా ఉండేది.

అదివరకల్లా నాకు సినిమావ్యామోహం లేదనుకునేవాణ్ణి. కాని నాకు తెలీకుండా ఉండి ఉండాలి. ఇప్పుడు సినిమా గురించి నాకున్న అసహ్యం చూస్తే వెనక నాకున్న భావం వ్యామోహమే అయి ఉండాలి. ఇంకేమై ఉంటుందని పించింది. ఈ మూకలో నేనుకూడా ఒకణ్ణనుకున్నప్పుడల్లా ఏదో వింత

వికారం నాలో కలుగుతూ వచ్చేది. ఒక వేళ నేను మడిగట్టుకున్న మనిషినేమో? ఎవరితోటీ కలవటం నా కిష్టంలేదేమో? అదివరకల్లా ఈ రహస్యం నేను తెలుసుకో లేకపోయానేమో? లేకపోతే జాతినీ, కులాన్నీ పాటించని నేను ఈ మనుషులను ఇంత నీచంగా ఎందుకు చూస్తున్నాను? ఈ ఆలోచనలు నన్ను బాధించసాగాయి.

అన్నిటికన్నా నన్ను మరీ బాధిస్తూ వచ్చినది డబ్బు డబ్బేమో సినిమా పేర నీటివలెగా ఖర్చయిపోతున్నది. నా చేతికి ఒక దమ్మిడీ వచ్చినదిలేదు. వచ్చి రెండు నెల్లయింది. ఇంటికొక నలభై రూపాయలు వెళ్ళనై నాకింద ఏ రెండు వందలో ఖర్చయినై. కాని దానివల్ల నాకేమీ ఫలితం కలగలేదు. హోటళ్ళ వాళ్ళూ వాళ్ళూ బాగుపడ్డారు. నేను చేసినపని అసలే లేదు. నన్నింటి దగ్గర కూర్చోబెట్టి ఈ రెండువందల్లో సహం ఇచ్చినా నాక్కో అయిదారునెల్ల గ్రాసం ఏర్పడి ఉండును ఎన్నో కంట్రాక్టులు రాశారు ఎన్నో వందల అడ్వాన్సిచ్చారు. వేషం వెయ్యటానికి తెచ్చిన వాళ్ళలో నాకున్నపాటి మొహం కూడా లేనివాళ్ళున్నారు. పాడటానికి వచ్చినవాళ్ళలో నా పాట విని ఆనందించే నిర్భాగ్యులున్నారు. వాళ్ళందరి పేరా కంట్రాక్టులున్నై. నా పేర ఎందుకు లేవంటే నేను వెళ్ళివారి తరపు మనిషిని. పోసి రెండునెల్లు విశ్రాంతిగా కూర్చున్న తృప్తి అయినా నాకు దక్కిందా అంటే అదీ లేదు. నేను కథ రాయటమేగాక, అది ఆమోదించబడు తుందనే నమ్మకంతో దానికి సంభాషణలు కూడా రాశాను. పాటలుకూడా రాసే వాణ్ణేమోకాని, ముందుగా మ్యూజిక్ డైరెక్టరు ఏయే మట్లు తస్కరిస్తాడో తెలియకుండా పాటలు రాయటం క్షేమం కాదన్నారు. ఈ పనికూడా అయినాక నాకేమీ తోచక సినిమా టెక్నిక్ మీదా స్క్రిప్టురైటింగుమీదా పుస్తకాలు కొని చదవసాగాను. ఆ పుస్తకాలు చదివినాక నాకొకటి స్పష్టంగా తెలిసింది. ఈ ఫిలిం నిర్మాణంలోకి అనుభవం లేనివాళ్ళు వచ్చినా దిగరాదు. ఈ పుస్తకాలు కొంచెం ముందర్తిగా చదివి ఉంటే నేను తగుదునమ్మా అని వచ్చినా ఆ కథగాని ఆ సంభాషణగాని రాసి ఉండను. నేనే అనుకుంటే నాకన్న అసమర్థులు నా చుట్టూ ఉన్నవారు.

ఈ వాతావరణంలో నాలో ఒక విధమైన జడత్వం ప్రవేశించింది. "ఎవరెట్లా చస్తే నాకేం?" అనే విరక్తి ఒకటి నన్నావేశించింది. భరించలేని బాధ కలిగినప్పుడు మనిషికి స్పృహతప్పి నట్టుగా, భరించలేని ఆలోచనలు కలిగి నప్పుడు బుద్ధికూడా స్పృహతప్పుతుంది. ఇది నా మనస్థితికి ద్వితీయావస్థ. ఈ అవస్థలో నేను ఇతరులు చేసేదాన్ని

గురించి విమర్శించడం మానేశాను. వెలుగులోనుంచి చీకటిగదిలోకి వచ్చిన వాడి కళ్ళకు మొదట అంతా గాఢాంధ కారంగా ఉండి క్రమంగా వెలుగునీడలు అవుపించినట్టుగా నా బుద్ధికి సీనాయి చేసే ప్రయత్నాలలో ఇప్పుడు కొంత మంచీ కొంత చెడూ కనిపించసాగింది వాడి అవివేకం కొంత సహించడం నేర్చుకోసాగాను.

ఈవిధంగా నా బుద్ధి పరిస్థితులకు అలవాటుపడుతూ రావటంవల్ల నాకేమీ లాభం కలగలేదు. ఎందుచేతనంటే క్రమంగా పరిస్థితులు క్షీణించసాగాయి. డబ్బు చాలాభాగం అయిపోయింది. కథ కింకా సంభాషణలు రాస్తున్న సమయం లోనే డబ్బు లెక్కలు చూచుకోవటం జరిగి అప్పటికే ముప్ఫైవేలు అయిపోయి నట్టు బసవయ్యగారు అంచనా కట్టాడు. అంతా చేరి డబ్బు తగలేశారనే మాట వచ్చింది. సీనాయికిగాని మూర్తికిగాని ఈ మాట ఏమీ బాధకలిగించలేదు. కాని నేనూ, రంగడూ గిలగిలలాడిపోయినాం. రంగడు సీనాయిని దబాయించాడు కూడాను. కాని సీనాయి నిర్లక్ష్యంగా "అందరూ డబ్బు తగలేసినవాళ్ళమే- ఇందులో తక్కువ తిన్నవాడెవడూ లేడు," అనేశాడు.

డబ్బునుగురించి ఎప్పుడైతే పంచాయతీ జరిగిందో ఆ పంచాయతీలో మిగిలిన విషయాలుకూడావచ్చినయి. ఇంతవరకూ పిక్చరు షూటింగు ఎందుకు ప్రారంభం కాలేదు ? బుక్కుచేసినవాళ్ళకి జీతాలు ముట్టుతున్నాయి. స్టూడియోకు ఏనాడో ఎడ్వాన్సివ్వటం జరిగింది మా తరవాత వచ్చినవాళ్ళు సహం పిక్చరు పూర్తిచేసుకున్నారు అదే స్టూడియోలో.

"మనంకూడా షూటింగ్‌కు రెడీగానే ఉన్నాం. సంభాషణలేవి, పాటలేవి ?" అన్నాడు మూర్తి.

"ట్రీట్‌మెంట్‌లేకుండా సంభాషణలు గాలిలో రాస్తామా ?" అన్నాను.

"అయ్యా, ఇది హాలీవుడ్డుకాదు. కథఉంది. ఒకటీ, రెండూ, మూడు అని మీకు సీక్వెన్సులిస్తాను. వాటికి సంభాషణలు రాసెయ్యండి. ముందు ఫలాని సెట్టనుకుంటే ఆ సెట్టమీద వచ్చే సీక్వెన్సులన్నీరాసేద్దురుగాని," అన్నాడు మూర్తి.

ఆ క్షణానికి మూర్తి చాలా దక్షత గలవాడుగా బయటపడ్డాడు. మర్నా డుదయం అతను ఒక చిన్నసైజు కాగితంమీద అటూ ఇటూ పొడిమాటలు రాసుకొచ్చాడు. ఆ మాటల ముందు అంకెలు వేశాడు మొత్తం 19 అంకె లున్నాయి. కాగితం పొడుగు ఆరంగు ళాలూ, వెడల్పు రెండంగుళాలూ ఉన్నది. అదే మా సినారియో అని నే నర్థంచేసు కున్నాను వాటిల్లో ఒక్క సెట్టుమీద వచ్చే నాలుగైదు సీక్వెన్సులు చూపి వాటికి నన్ను సంభాషణలు రాయ

మన్నాడు డైరెక్టరు. ఏ రంగంలో ఏయే పాత్రలుంటాయో ముందు రాసుకున్న కథనుబట్టి స్పష్టంగా తెలీను పోసీ 20 సీక్వెన్సులూ రాసుకున్నాకనే షూటింగు ప్రారంభించకూడదా, అన్నాను

"ఒక్క-క్షణం వృధాచెయ్యటం నా కిష్టంలేదు. మీకేం మహరాజులు. ఇంకో పదివేలు ఖర్చయితే మీకు లెఖ్ఖలేదు. నేను పైకిరావలిసినవాణ్ణి మీ వీలుకోసం నేను నా కీర్తి పాడుచేసుకుంటే రేపు నాకు మంచినీళ్ళు పుట్టవు!" అన్నాడు మూర్తి.

అతను కోరినట్టే రాశాను. ముఖ్య పాత్రలు మాత్రం నే నెరుగుదును. కాని తాత్కాలికంగా వచ్చే పాత్రలను ముందు రంగాల్లో ఏవిధంగా ఉపయోగించుకో వచ్చు, తరవాత వాళ్ళతోపని ఏమైనా వస్తుందో రాదో కూడా నాకు తెలియదు.

సభాషణలు చాలా బాగున్నాయన్నా రందరూనూ. నాకే తెలియని విషయం వాళ్ళకు తెలియటం చూస్తే ఆశ్చర్యం వేసింది. అయితే నా చుట్టూఉన్న వాళ్ళెటువంటివాళ్ళంటే ఏదో కథలో ఏతో పాత్ర నోటినుంచి ఒక సంభాషణ ఎత్తి పరీక్షించి, కథగాని పాత్రగాని తెలియకుండానే ఆ సంభాషణ బాగున్నదీ లేనిదీ చెప్పేరకం.

* * *

ఎంతోకాలంగా ఎదురుచూసిన దివ్య ఘడియ వచ్చింది మా చిత్రం షూటింగు ప్రారంభించేరోజు వచ్చింది. సెట్టింగు సిద్ధంగా ఉంది. వచ్చి పని ప్రారంభించుకోమన్నారు స్టూడియోవాళ్లు. ఇప్పటికి లాడ్జికో 20 మందిదాకా పాత్రదారులున్నారు. అందులో ఒకరిద్దరు వెనక సినిమాల్లో వేసిన వాళ్ళేగాని ఖ్యాతి గడించిన వాళ్ళుకారు. మిగిలిన వాళ్ళంతా అదోరకం సజ్జు.

షూటింగునాడు మూర్తి తప్పతాగి సెట్టుమీదికి వచ్చాడు. వాడితో సమంగా తాగిఉన్నాడు సీనాయి. అయితే సీనాయి నలుగురి ఎదటా పడలేదు లైట్లులేని మూలగా చూసుకుని నిద్రపోయినాడు. మూర్తి మాత్రం, ఒక చెంప తూలిపడి పోతున్నా, సెట్టంతా పర్యటనంచేస్తూ, కనబడ్డ వాడికల్లా, "నమస్కారమండి, ఇప్పుడు చూపిస్తా, నా తడాఖా!" అంటూ నానా అల్లరి చేస్తున్నాడు. స్టూడియో తాలూకు మనుషులు కొందరు వాణ్ణి బయటికి నెట్టారుగాని, వాడే డైరెక్టరని తెలిసినాక ఏంచెయ్యాలో వాళ్ళకి తెలీలేదు.

డైరెక్టరు పదవి ఇచ్చే దాతలున్నారు కనక మూర్తి డైరెక్షనును అంగీకరించాడే గాని,ఆ పనిచెయ్యగలననే ధైర్యం అతనికి లేదు తీరా బాధ్యతను ఎదుర్కోవలసి వచ్చే సమయానికిబెదిరిపోయి సీనాయితో పాటు చిత్తుగా తాగివచ్చాడు వాడి నిషా దిగటానికి కాఫీ ఇచ్చారు. కాఫీ తాగేసి




ఠక్కున వాంతి చేసుకున్నాడు. ఆ తరవాత పెద్ద పెట్టున ఏడుపు సాగించాడు.

ఆనాటికి ఎట్లాగో ఒక షాటు తీసేశారు నేను "కవి" గనక కొంచెం సహాయంచేస్తే మరికొన్ని షాట్లు తీస్తానన్నాడు కామెరామెన్. అతనికి కావలిసిన సహాయం ఏదో ఆ రోజుకు చేసేశాను.

మర్నాడు మా రంగడు, "నువే డైరెక్టు చెయ్యరా! వాణ్ణి వెళ్ళగొట్టేద్దాం! వాడేమీ పనికివస్తాడని నాకు తోచటం లేదు," అన్నాడు నాతో. డైరెక్టు చెయ్యటం నా పని కాదని చెప్పాను. మూర్తితో బసవయ్యగారు చాలా ఘర్షణ పడటంకూడా జరిగింది. కాని సీనాయి మూర్తికి క్షమాపణలు చెప్పి మళ్ళీ వాణ్ణే పెట్టించాడు నేను డైరెక్టు చేస్తానని ముందుకు రాకపోవటం చాలా మంచిదయింది.

మూర్తి ఆధ్వర్యంలోనే షూటింగు సాగింది. ఫోటోగ్రాఫర్ చేతా, రికార్డిస్టు చేతా రోజూ మూర్తి చివాట్లు తినేవాడు. వాడి మాట లైట్లవాళ్ళుకూడా వినేవాళ్ళు కారు. "లైట్స్, రెడీ, షూట్" అని అరవటం వాడికి తెలుసు కామెరా సిద్ధంగా ఉందా, ట్రాన్స్‌ఫార్మరు స్టార్టు అయిందా అనే ఆలోచనలేదు. రికార్డిస్టు చేసే సంజ్ఞలు వినిపించుకునే వాడు కాడు ఈ గొడవంతా చూసి వాడి మాట ఎవరూ వినిపించుకోవటం మానేశారు. తాను తీస్తున్నపాటే వాడికి తెలిసేదికాదు. మూర్తివల్ల పనికాదు మరొకర్ని పెట్టుకోమని మంచిగా బసవయ్యగారికీ సీనాయికీకూడా చెప్పాను సీనాయి నామీద ఎగిరిపడ్డాడు. నీకు డైరెక్షనేం తెలుసునన్నాడు నేను గొప్ప వాణ్ణనుకుంటున్నాననే బాధ ఎంతకాలం నుంచీ వాడి హృదయంలో పేరుకుని

ఉందో గాని ఆ క్షణాన చాలా వెళ్ళగక్కాడు

మూర్తిగాడితో పని కాదనేమాట బసవయ్యగారితో స్టూడియో వాళ్ళే అనటం జరిగింది. అప్పుడు సీనాయి వాళ్ళతో, "మీకేం తెలుసు ?" అనే అవకాశం లేకపోయింది. ముందరే ఆ మాట చెప్పినందుకు నన్ను సీనాయి అభినందించనూలేదు. కాని ఒక కొత్త ఉపాయం ఆలోచించాడు.

"మూర్తిగాడిమీద మనం బాధ్యత వెయ్యకుండా, వాడేం చెయ్యవలసిందీ నిర్ణయించటానికి ఒక సంఘం తయారు చేసుకుందాం," అన్నాడు సీనాయి.

"మూర్తికి సలహా ఇచ్చే తాహతున్న మనుషులు, వాళ్ళే డైరెక్షన్ చెయ్యవచ్చుగా ?" అన్నాను.

సీనాయి ఏదైనా సహించగలడుగాని నా నోట యదార్థం వస్తే సహించలేడు.

"నువ్వేదీ చెప్పవు మమ్మల్ని ఏ ఆలోచనా చెయ్యనియ్యవు. నువు మాలో వాడివా ? మాకు విరోధివా ?" అని అడిగాడు సీనాయి నన్ను.

"మీలోవాణ్ణికాను, మీ విరోధినీకాను. దగ్గర ఉన్నానుగనక మీ మంచికోసం చెబుతున్నాను. డైరెక్టు చెయ్యటం చాతగానివాళ్ళు నలుగురుచేరి డైరెక్టరని వచ్చినవాడికి ఏం చెయ్యాలో చెబుతారా? దానివల్ల లాభం ఏమిటి ? పైగా ఎంత నష్టం ఉంది! రేపు వాడు పిక్చరు తగలేస్తే వాణ్ణి మనం ఏమీ అనటానికైనా ఉండదే ? 'మీరే నన్ను చెయ్యమన్నారు. మీ ఒప్పందలతోటే అంతా చేశాను,' అని వాదనదూ ?" అన్నాను


సీనాయి మొహం మాడ్చుకుని, "ఏమో ఇప్పుడింకో డైరెక్టరును కుదర్చడం, అసంభవం మూర్తి అడ్వాన్సుగా చాలా డబ్బు తినిఉన్నాడు. మనం పట్టుకోగల తప్పులైనా లేకుండా చూసుకో వచ్చుగద నేను చెప్పినట్టు చెయ్యాల్సిందే!" అన్నాడు. వాడి వాదం తండ్రికి నచ్చినట్టు కనపడింది.

సీనాయి చెప్పినట్టు చెయ్యటంవల్ల కలిగిన ప్రయోజనం ఏమీ లేకపోయింది. మూర్తికి ఏంచెయ్యాలో చెప్పేపని సీనాయి తనమీదే వేసుకున్నాడు.

ఇక ఈ సినిమాతో నాకే మీ సంబంధం అవసరం లేదనిపించింది. రెండురోజులపాటు కూచుని మిగిలిన సీక్వెన్సులకు సంభాషణలన్నీ రాసేసి, నాకు తోచిన పాటలుకూడా రాసి రంగనాథంతో, "అబ్బాయీ, నాకు చెక్క వొంగింది. ఏమైనా వచ్చేదివుంటే ఇప్పించు. నేను వెళతాను," అన్నాను.

"చివరిదాకా ఉండరా! నీకు జీతం ఏమిటి ఖర్మ ? పిక్చరుమీద లాభంలో నాకు మూడోవంతు వస్తుంది. అందులో సహం నీకిస్తాను," అన్నాడు రంగడు.

"అంతా ఇవ్వమన్నా నాకే యిస్తావు! కాని ఇంకో లక్షలేందే ఈ పిక్చరు



పూర్తికాదు. పూర్తి అయినాక ఇది ఒక వారమన్నా నడుస్తుందో నడవదో. ఇందులో లాభం వచ్చేదేమిటి? నువు నా కిచ్చేదేమిటి?" అన్నాను.

నా మాటలన్నీ తూచా తప్పకుండా రంగడు సీనాయితో చెప్పాడని నే నూహించాను. సీనాయి నా దగ్గిరకు వచ్చి, "వెళ్ళిపోతామన్నారుటగా?" అన్నాడు ఎన్నడూలేని బహువచనం ప్రయోగిస్తూ.

"అవును. నేనిప్పటికి వచ్చి నాలుగు నెలలు కావస్తున్నది. నా పనేమో ఎంతకీ అయిపోదు. సంభాషణలూ, పాటలూ రాసేశాను. ఇంటిదగ్గర పెళ్ళాంపిల్ల లేమవుతున్నారో తెలీదు. నాకేదన్నా వచ్చేదుంటే ఇప్పిస్తే నేను పోతాను," అన్నాను.

"దానికేంగాని, మీరు ఏంచేసినా చెయ్యకపోయినా చివరిదాకా ఉండి సహాయం చేస్తారేమో అనుకున్నాం. అసలు మీకు మా పిక్చరులోనే ఇంటరస్టు లేదని తెలిపోయింది. ఆ భాగ్యానికి ఇన్నాళ్ళుండటంకూడా అనవసరమే ఎప్పుడు వెళతానన్నా మా అభ్యంతరం ఉండేది కాదు ... అయితే ఇప్పుడు మీకేం రావాలంటారు?" అన్నాడు.

సీనాయి వాగ్ధోరణి నాకు నచ్చలేదు.

కాని వాడితో పోట్లాడటానికి నాకేమీ ఓపికలేదు.

"ఇంత రావాలని నే ననటంలేదు. ఇంటికి పోతున్నాను కనక నా ఎకౌంట్ సెటిల్ చెయ్యమంటున్నాను," అన్నాను.

"ఇంటికి వెళ్ళడానికి పదిరూపాయలు చాలవూ ?" అన్నాడు సీనాయి.

ఈ మాటకి నేను దిమ్మెరపోయినాను. కాని నా నోట ఏ మాటా వచ్చేలోపలే నా పక్కనున్న రంగడు కాలి చెడావు విప్పి సీనాయి నెత్తిన ఫెడీమని కొట్టాడు. సీనాయి మొహాన చావుభయం కనిపించింది.

"బుద్ధితక్కువగా మాట్లాడితే చంపేస్తానురోయ్, సీనాయ్! నీ పిక్చర్లో వాడు ఇంటరెస్టు తీసుకోలేదంటావు. నువు వాణ్ణెన్నడైనా ఇంట్రెస్టు తీసుకోనిచ్చావా? తనకు చాతకాని పన్లకు రాకపోవటమేనా వాడుచేసిన ద్రోహం? ఎన్ని విషయాల్లో వాడు ముందుగా జరగబొయ్యే నష్టాలు చెప్పాడు? ఒకటైనా పొల్లుపోయిందా? ఒక్కసారయినా విన్నావా?" అన్నాడు.

రంగడు నన్నీపిక్చరు గొడవలోకి దించి ఏమైనా తప్పుచేసిఉంటే దానికంతకూ ఈ మాటలతో పరిహారం చేశాడు.

అంతేకాక రంగడు నావెంట తనూ బయల్దేరాడు. రంగడు నాకు కనీసం రెండువందలన్నా ఇప్పించాలని చూశాడు. కాని బసవయ్యగారు పాతికరూపాయలు నా చేతిలోపెట్టి "ప్రస్తుతం ఖర్చుకి ఇవి ఉంచుకోండి. తరవాత చేతిలో డబ్బు చూసుకుని మనియార్డరు చేస్తాను," అన్నాడు.

డబ్బు లేకపోతే పీడాపాయిరి. నేనా బెడద వదిలించుకుని బయటపడ్డాను. అదే నాకు పదివేలు. ఆ పిక్చరు పూర్తి కాలేదు బసవయ్యకు పిచ్చిఎత్తిందని కూడా విన్నాను. ఈ దిక్కుమాలిన పిక్చరుకోసం ఆయన ఉన్నదంతా పోగొట్టుకుని అప్పులపాలు కూడా అయినాడుట. ఒకస్థితిలో కొంతతయారై పిక్చరును అమ్మజూపితే పదివేలూ, పదిహేనువేలూ ఇస్తామన్నాడుట. ఆ పిక్చరు పూర్తికాలేదన్నా, బసవయ్యకు పిచ్చిఎత్తిందన్నా నాకేమీ ఆశ్చర్యం లేదు. కాని కాలినవాడికి నిప్పంటే భయమైనట్టు ఈనాటికీ నాకు సినిమా అంటే మటుకు చచ్చే భయం మిగిలిఉంది.

